# 53

# దేవునికి విధేయులగుట వలన కలుగు ప్రతిఫలములు

## (56:1-8)

55వ అధ్యాయం దేవునికి లోబడుట వలన కలుగునని తెలియజెప్పుటకు రచింపబడియున్న ఆశీర్వాదముల గూర్చిన ఆలోచనలను కొనసాగించుచున్నది. ఈ అధ్యాయం యొక్క అన్వయింపును జాన్ విల్లీస్, బబులోనులో చెరపట్టబడినవారైయుండి "పాలస్తీనాకు తిరిగి వచ్చిన యూదుల నడమ నివసించుచుండినవారికి" పరిమితము చేసాడు.[1] ఏదిఏమైనా, ఇక్కడ ఉన్న ఆలోచనలు చెర నుండి తిరిగి వచ్చినవారి కంటె మరి ఎక్కువైనవారికి అన్వయించునని తెలియజెప్పు స్పష్టమైన సూచనలున్నవి, ఏలయనగా అన్యులు మరియు నపుంసకుల గూర్చి వివరింపబడినది మోషే ధర్మశాస్త్రము ప్రకారము కచ్చితమైన రీతిలో అన్వయింపజేయబడలేదు.

### నిత్యముగ నిలిచియుండు నామము (56:1–5)

యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
–నా రక్షణ వచ్చుటకు సిద్ధముగా ఉన్నది
నా నీతి వెల్లడియగుటకు సిద్ధముగా ఉన్నది.
న్యాయవిధిని అనుసరించుడి
నీతిని అనుసరించి నడుచుకొనుడి.
నేను నియమించిన విశ్రాంతిదినమును అపవిత్రపరచ
కుండ దానిని ఆనుసరించుచు
ఏ కీడు చేయకుండ తన చేతిని బిగబట్టువాడు
ధన్యుడు
ఆ ప్రకారము చేసి దాని రూఢిగా గైకొను నరుడు
ధన్యుడు.
యెహోవాను హత్తుకొను అన్యుడు –
నిశ్చయముగా యెహోవా తన జనులలోనుండి నన్ను
వెలివేయునని అనుకొనవద్దు.
షండుడు – నేను ఎండిన చెట్టని అనుకొనవద్దు.
నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరించుచు
నాకిష్టమైనవాటిని కోరుకొనుచు
నా నిబంధన నాధారము చేసికొనుచున్న షండులను గూర్చి
యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
–నా యింటను నా ప్రాకారములలోను ఒక భాగమును వారికిచ్చెదను
కొడుకులు కూతుళ్లు అని యనిపించుకొనుటకంటె

శ్రేష్ఠమైన పేరు వారికి పెట్టుచున్నాను
కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను.

"న్యాయవిధిని అనుసరించుడి మరియు నీతిని అనుసరించి నడుచుకొనుడి" (వచనం 1బి) – "న్యాయము" మరియు "నీతి" అని దేవుడు బయలుపరచిన విషయములకు యూదా ప్రజలు తమ్మును తాము అంకితము చేసికొనవలెనని ఇవ్వబడిన పిలుపై యున్నది. ఇదే సవాలు యెషయాకు సమకాలికుడును ప్రవక్తయునైన మీకా ద్వారా చేయబడినది: "మనుష్యుడా, యేది ఉత్తమమో, అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు?" (మీకా 6:8). రక్షణ దేవుడిచ్చు ఉచిత బహుమానమై యున్నది, కానీ మానవుడు ఇందుకు కృతజ్ఞత గల విధేయతతో ప్రతిస్పందించవలసి యున్నది. సంఘము సహితము న్యాయమును అమలుపర్చుచు నీతిని జరిగించవలెనని పిలుపు ఇవ్వబడుచున్నది.

"ఆ ప్రకారము చేసి దాని రూఢిగా గైకొను నరుడు ధన్యుడు" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 2). "ధన్యుడు" అను మాటను "ఆనందించును" అని కూడ అనువదించవచ్చును. నిజమైన ఆనందము దేవుని చిత్త ప్రకారము చేయుటలో ఉన్నది. యూదులకు, దేవుని చిత్త ప్రకారము చేయుట అనంటే ఎక్కువగా "సబ్బాతును అపవిత్రము" చేయకుండుటయను గ్రహింపు ఉండినది. సబ్బాతును ఆచరించుట ద్వారా ఇశ్రాయేలు సృష్టిలోను (ఆదికాండము 2:3) వారిని ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించుటలోను (ద్వితీయోపదేశకాండము 5:15) గల దేవుని శక్తిని గుర్తించినది. సబ్బాతును ఆచరించుట గూర్చిన శాసనములు నిర్గమకాండము 20:8–11లో తెలియజెప్పబడియున్నవి.

మోషే ధర్మశాస్త్రము (వచనాలు 3–5) ఆరాధించుచుండు ఇశ్రాయేలీయుల సభల నుండి కొందరు అన్యులను మరియు నపుంసకులను మినహాయించినది.[2] ఏదిఏమైనా, ఈ ప్రజలు వ్యధచెందాల్సిన అవసరంలేదు. వారు కూడ, దేవుని ప్రణాళికలో చేర్చబడునట్లు, ఒక రోజు వస్తుంది, ఈ వచనములలో బోధింపబడినదానికి ఐతియోపీయుడైన నపుంసకుడు ఒక ఉదాహరణమై యున్నాడు. జాన్ ఎన్. ఆస్వాల్ట్ ఇలా చెప్పుచున్నాడు, "ఆయన సామాన్యముగా కుమారులను కుమార్తెలను కలిగియున్న దానికంటె మరి ముఖ్యముగా, ఆయన కలిగియుండిన విశ్వాసమునుబట్టి జ్ఞాపకము చేసికొనబడుచున్నాడు."[3]

## సమస్త జనులకు ప్రార్థన మందిరము (56:6–8)

విశ్రాంతిదినమును అపవిత్రపరచకుండ ఆచరించుచు
నా నిబంధనను ఆధారము చేసికొనుచు యెహోవాకు
    దాసులై యెహోవా నామమును ప్రేమించుచు
ఆయనకు పరిచర్య చేయవలెనని ఆయన పక్షమున
    చేరు అన్యులను
నా పరిశుద్ధ పర్వతమునకు తోడుకొని వచ్చెదను
నా ప్రార్థన మందిరములో వారిని ఆనందింపజేసెదను
నా బలిపీఠముమీద వారర్పించు దహనబలులును బలులును

నాకు అంగీకారములగును
నా మందిరము సమస్తజనులకు ప్రార్థనమందిరమనబడును.
ఇశ్రాయేలీయులలో వెలివేయబడినవారిని సమకూర్చు
ప్రభువగు యెహోవా వాక్కు – ఇదే
–నేను సమకూర్చిన ఇశ్రాయేలు వారికిపైగా ఇతరులను కూర్చెదను.

నిబంధన దీవేనలు దేవునితో ఒక ప్రత్యేక సంబంధమును నెలకొల్పుకొన్న "అన్యులకును" వర్తింపజేయబడినవి. వారు "ఆయనకు పరిచర్య చేయదురు." "యెహోవా నామమును ప్రేమించుదురు." "ఆయనకు దాసులగుదురు." "విశ్రాంతి దినమును అపవిత్రపరచకుండ" ఆచరించుదురు, మరియు "నా నిబంధనను ఆధారము చేసికొందురు" (వచనం 6). "నా మందిరము సమస్త జనులకు ప్రార్థనమందిరమనబడును" అని దేవుడు సెలవిచ్చాడు, గనుక కుమారులు అనుభవించుచుండిన సకల ప్రత్యేకార్హతలు వారు కూడ అనుభవిస్తారు (వచనం 7సి). యేసు దేవాలయములో ప్రవేశించి క్రయవిక్రయములు చేయువారినందరిని వెళ్లగొట్టి, రూకలు మార్చువారి బల్లలను గువ్వలమ్మువారి పీఠములను పడద్రోసినప్పుడు ఆయన ఈ పదబంధమును యూదా మత నాయకులకు గుర్తుచేసాడు.[4] యేసు రాక పూర్వము నిబంధన దీవెనలలో నుండి ఎన్ని దీవెనలు అన్యజనులకు అన్వయింపజేయబడినవో తెలియదు; కానీ ఆయన రాకడతో, ఈ ప్రవచనము యొక్క అంతిమ నెరవేర్పు సఫలీకృతమైనది.

"ప్రభువగు యెహోవా వాక్కు ఇదే" (వచనం 8) – ఈ వచనము యొక్క ప్రారంభమునకు ఇదొక అక్షరార్థ అనువాదమై యున్నది. ఇది ఒక పవిత్రమైన ప్రకటనను తెలుపుచున్నది. ఆయన "ఇశ్రాయేలీయులలో వెలివేయబడినవారిని" సమకూర్చుట మాత్రమేగాక, "నేను సమకూర్చిన ఇశ్రాయేలు వారికిపైగా ఇతరులను కూర్చెదను" అని కూడ ఆయన సెలవిచ్చాడు. "ఈ దొడ్డివికాని, వేరే గొర్రెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును; అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" అని యేసు చెప్పినప్పుడు, ఆయన బహుశా ఈ వచనం గూర్చే ఆలోచించుచుండి యుండవచ్చును (యోహాను 10:16). ఇదే విధంగా దేవుడు చేసిన ప్రకటన ఆయన "విశ్వవ్యాప్తముగా విస్తరించియున్న వారిని సమకూర్చుట" గూర్చిన హేతువును చూపించుచున్నది.[5]

---

సూచనలు

[1]John T. Willis, *Isaiah,* The Living Word Commentary on the Old Testament, ed. John T. Willis (Abilene, Tex.: ACU Press, 1980), 435. [2]ద్వితీయోపదేశకాండము 23:1–8. ఇశ్రాయేలీయుల యెడల వారికుండిన వైరముతో కూడిన వైఖరినిబట్టియు వారి అన్యమతారాధన అభ్యాసములనుబట్టియు అన్యులు మినహాయింపబడిరి. నపుంసకులు శారీరికముగా వారు కలిగియుండిన లోపమునుబట్టి మినహాయింపబడిరి. [3] John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 459, అపొస్తలుల కార్యములు 8:27–39 చూడుము. [4]మత్తయి 21:12, 13; మార్కు 11:15–17; లూకా 19:45, 46 చూడుము. [5]Oswalt, 461.

## ❖❖❖ దేవుని "ఎలా" వెదకవలెను ❖❖❖

## (అధ్యాయం 56)

దేవుడు నియామకము చేసిన విధానములో ఆయనను వెదకుటకు గల అవసరతను ఈ అధ్యాయం ప్రముఖంగా ప్రకటించుచున్నది. "యెహోవా మీకు దొరుకు కాలమునందు ఆయనను వెదకుడి" అనియు "ఆయన సమీపములో ఉండగా ఆయనను వేడుకొనుడి" అనియు మనకు 55:6లో చెప్పబడినది. ఏదిఏమైనా, రెండు ప్రశ్నలు వెంటనే తలెత్తుచున్నవి: "ఒకరు ఆయనను ఎలా వెదకుచుండవలెను?" మరియు "మనము ఆయనను ఏదైన ఒక నిర్దిష్టమైన విధానములో వెదకవలెనని దేవుడు మనలను అడుగుచున్నాడు?" ఈ రెండు ప్రశ్నలకును 56వ అధ్యాయంలో స్పష్టమైన సమాధానమీయబడి యున్నది.

*విధేయతను కలుగజేయు పశ్చాత్తాపముతో మనము ఆయనను వెదకవలెను.* "నా రక్షణ వచ్చుటకు సిద్ధముగా ఉన్నది మరియు నా నీతి వెల్లడి యగుటకు సిద్ధముగా ఉన్నది, గనుక న్యాయవిధిని అనుసరించుడి, నీతిని అనుసరించి నడుచుకొనుడి" అని దేవుడు సెలవిచ్చాడు (వచనం 1). పశ్చాత్తాపపడెడు ఈ వైఖరి "ఏ కీడు చేయకుండ తన చేతిని బిగబట్టువానిని" పుట్టించును (వచనం 2బి). పశ్చాత్తాపములో రెండు మలుపులుంటాయి: చెడు నుండి (వెను) తిరుగుట మరియు దేవుని చిత్తము వైపునకు మళ్లుట.

*విశ్వవ్యాప్త జనుల రక్షణ గూర్చిన ఆయన సమస్తత్వమును అవలంబించుట ద్వారా మనము ఆయనను వెదకవలెను.* దేవుడు సర్వ లోకములోని సమస్త జనులను ఎల్లప్పుడు ప్రేమించుచు వారి రక్షణను కోరుచున్నాడు. ఈ సందర్భములో నపుంసకుడు, కొన్ని విషయాలలో అప్రాచ్యుడని అనుకొనబడినవాడు సహితము, దేవుని హృదయములో స్థానము సంపాదించుకొన్నాడని మనము గమనించుచున్నాము: "నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరించుచు నాకిష్టమైనవాటిని కోరుకొనుచు నా నిబంధన ఆధారము చేసికొనుచున్న షండులను ... కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను" అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (వచనాలు 4, 5). ఇంక కొంచెము వివరమైన విధంగా, "యెహోవా నామమును ప్రేమించుచు ఆయనకు పరిచర్య చేయవలెనని" ఆయన పక్షమున చేరు "అన్యులను" కూడ ఆహ్వానించుచున్నాడని ఆయన సెలవిచ్చుచున్నాడు (వచనం 6). "నా బలిపీఠము మీద వారర్పించు దహనబలులును బలులును నాకు అంగీకారములగును" అని ఆయన చెప్పుచున్నాడు (వచనం 7బి). ఇంకా, "నా మందిరము సమస్త జనులకు ప్రార్థనమందిరమనబడును" అని కూడా చెప్పుచున్నాడు (వచనం 7సి).

*పరిచర్య చేయుటకు నిబద్ధత కలిగియుండునని తనంతట తానే వ్యక్తము చేసికొను కోరికతో మనము ఆయను వెదకవలెను.* దేవుని వంటి వాడు ఒక దాసుడై యుండును. అతడు నిజమైన దాసత్వమును ఉదాహరణముగా తేటపర్చును. ఆయన యొద్దకు యథార్థతతో వచ్చువారు "ఆయనకు దాసులై యుండుటకు" వచ్చెదరు (వచనం 6బి). పేరాసగలవారు, స్వార్థపరులు, స్వంత కోరికలను తీర్చుకొనువారు, లేదా దేవుని చిత్తము గూర్చి అజ్ఞానియై

యుండుటకు ఎన్నుకొనువారు, దేవుని దాసులై యుండనేరరు. “వారి కాపరులు గ్రుడ్డివారు, వారందరు తెలివిలేనివారు. వారందరు మూగకుక్కలు మొరుగలేరు, కలవరించుచు పండుకొనువారు నిద్రాసక్తులు; కుక్కలు తిండికి ఆతురపడును, ఎంత తినినను వాటికి తృప్తిలేదు ఈ కాపరులు అట్టివారే, వారు దేనిని వివేచింపజాలరు; వారందరు తమకిష్టమైన మార్గమున పోవుదురు, ఒకడు తప్పకుండ అందరు స్వప్రయోజనమే విచారించుకొందురు” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనాలు 10, 11).

మనము రక్షణను సంపాదించుకొనజాలము; రక్షణ ఒకరి యోగ్యతాయోగ్యతలనుబట్టి అనుగ్రహింపబడునది కాదు. ఏదిఏమైనా, యథార్థమైన విశ్వాసము సత్ఫలితాలనిచ్చును. అది దేవుని ఆజ్ఞలను అనుసరించుచు ఆయన మార్గములలో నడుచుకొనును. ప్రవచనముల ఛాయలో, పేతురు కొర్నేలీ ఇంట నుండినప్పుడు పలికిన మాటలను ఈ వాక్యభాగము ప్రకటించుచున్నది: “దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను, ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువారిని ఆయన అంగీకరించును” (అపొస్తలుల కార్యములు 10:34, 35). దేవునికి భయపడుచు సరైన దానిని చేయుటకు ఎన్నుకొనువారెవరైనను దేవుని యొద్దకు నిర్భయముగా రావచ్చును, రాగలరు కూడ.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖విశ్వసనీయుడైన అన్యుడు మరియు నపుంసకుడు ❖❖❖ (56:3)

అతడు ఒక ఎండిన చెట్టు అని నపుంసకుడు తనను తాను సూచించుకొనవచ్చును ఏలయనగా నపుంసకులు పిల్లలు కనుటకు అవకాశము లేదు. గనుక అతనికి భవిష్యత్తు లేదని అతడనుకొనవచ్చును, కానీ ఆయనే నపుంసకుల భవిష్యత్తైయుండునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. దేవుడు “యెహోవాను హత్తుకొను” అన్యుని సహితము ఆదరించును (వచనం 3). ఆయన యెడల విశ్వసనీయులైయున్న అన్యుల దేవుని ప్రజల నుండి వేరైనవారని వారు అనుకొనవలెనని ఆయన ఆశించుటలేదు.

వారు ఒక విధమైన అమరత్వమును ఆర్జించుకొనవలెనను తాత్పర్యమే యూదులు సంతానము కొరకు తహతహలాడుటకు గల ముఖ్యకారణమై యున్నది. వారి పేర్లు ఎన్నటెన్నటికినీ మర్చిపోబడకుండా తరతరాలుగా నిలిచియుండవలెనని వారాశించారు. వాస్తవానికి, ఒకరు మర్చిపోబడాలని ఎవరునూ ఆశించరు! అందుచేతనే సమాధులపై నుంచబడు పాలరాళ్లపై, మరణించిన మన ప్రియుల పేర్లు చెక్కబడుచున్నవి. మనమందరమును అమరత్వముపై కొంత పట్టు మనకుండాలని ఆశిస్తాము. నపుంసకులను ఆయన మర్చిపోదని దేవుడు వారికి సెలవిచ్చియున్నాడు.